నేటి నుంచే ధాన్యం కొనుగోళ్లు

- 4 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం
- జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలు
- గన్నీ బ్యాగుల కొరత?

కరీంనగర్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. సోమవారం మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తున్నారు. జిల్లాలో వానకాలంలో 2,75,448 ఎకరాల్లో వరి సాగవగా, ఇందులో 1,18,500 ఎకరాల్లో సన్న రకాలు సాగయ్యాయి. అధికారుల అంచనా ప్రకారం 3,17,980 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 2,48,623 మెట్రిక్ టన్నుల సన్న రకాలు మొత్తం 5,66,603 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇందులో స్థానిక అవసరాలకు 55, 374 మెట్రిక్ టన్నులు, సీడ్ అవసరాలకు 75,471 మెట్రిక్ టన్నులు చొప్పున 1,17,778మెట్రిక్ టన్నులు పోను 4,35, 758 మెట్రిక్ టన్నులు మిగులుతుంది. ఇందులో 25,758 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 10 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లను నేరుగా మిల్లర్లు కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మిగిలిన మొత్తంలో 2,93,222 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1,07,778 మెట్రిక్ టన్నుల సన్న రకం చొప్పున 4.01 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నవంబర్‌లోనే అత్యధికం

నవంబర్‌లోనే పెద్ద మొత్తంలో కోతలు నిర్వహించే అవకాశాలు ఉంటాయని, అప్పుడే ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. కాగా, సోమవారం మానకొండూర్‌తో పాటు తిమ్మాపూర్ మండలం రేణికుంటలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు జిల్లా ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. అయితే, జనవరి వరకు కొనుగోళ్లు జరగనుండగా, ఈ నెలలో 23 శాతం అంటే 91,894 మెట్రిక్ టన్నులు రావచ్చని అంచనా. 58 శాతం కొనుగోళ్లు నవంబర్‌లోనే జరగవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆ నెలలో సుమారు 2,34,029 మెట్రిక్ టన్నులు రావచ్చని భావిస్తున్నారు. ఇక డిసెంబర్‌లో 16శాతం కింద 63, 826, జనవరిలో 3శాతం కింద 10,251 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం 340 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 51 ఐకేపీ, 238 ప్యాక్స్, 47 డీసీఎమ్మెస్, 4 హాకా కేంద్రాలు ఉన్నాయి.

గన్నీ బ్యాగులకు కొరత?

ధాన్యం కొనుగోళ్లకు సరిపడా గన్ని బ్యాగులు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. అయితే, అవసరాన్ని బట్టి తెప్పించుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌కు కోటి గన్నీ బ్యాగులు అవసరం ఉంటాయని అంచనా వేస్తున్నారు. అయితే, కొత్త వి.. పాతవి కలిపి ప్రస్తుతం 17,95,705 గన్నీ బ్యాగులు మాత్రమే ఉన్నాయి. ఇంకా 82,04,295 గన్నీ బ్యాగులు అవసరం ఉంటాయని అధికారులు ఇండెంట్ పెట్టారు. కొత్తగా సన్న రకం ధాన్యాన్ని నిర్ధారించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒకటి చొప్పున 340 మైక్రో మీటర్లు అవసరం ఉంటాయని ప్రతిపాదించారు. వీటిని ఇప్పటి వరకు ప్రభుత్వం సమకూర్చలేదు.

ఎమ్మెస్పీ తర్వాతనే బోనస్

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏ గ్రేడ్ ధాన్యానికి ₹2,320, సాధారణ రకానికి ₹2,300 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించింది. అయితే, జిల్లాలో ఈసారి పెద్ద మొత్తంలోనే సన్నరకం ధాన్యం పండించారు. సన్నాలు విక్రయించిన రైతులకు ₹500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో దొడ్డు రకానికి కూడా బోనస్ ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. అయితే, కొనుగోలు కేంద్రాల్లో సన్నాలు విక్రయించిన రైతులకు ఎమ్మెస్పీ జమ చేసిన తర్వాతనే బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎమ్మెస్పీ జమ చేసిన రెండు మూడు గంటల్లోనే బోనస్ ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ రైతులు ఈ విషయంలో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెస్పీ, బోనస్ ఒకే సారి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వడ్లు అమ్మాలంటే .. రైతు ఐరిష్ తప్పనిసరి

హుజూరాబాద్, అక్టోబర్ 13: కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించిన తర్వాత బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేందుకు గతంలో ఓటీపీ చెప్పి.. సంబంధిత పత్రాలు ఇస్తే సరిపోయేది. ఓటీపీ తోపాటు ఐరిష్‌ను కాంగ్రెస్ సర్కారు తప్పనిసరి చేసింది. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి దగ్గరికి రైతు వెళ్లి ఐరిష్ పెట్టి సక్సెస్ అయితేనే ఖాతాలో నగదు జమ కానున్నాయి. ఇందుకోసం సంబంధిత రైతు ఆధారుకార్డు తీసుకెళ్లి ఇవ్వాలి. ఒక వేళ కౌలు రైతు అయితే వ్యవసాయశాఖ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొంటేనే ధాన్యం నగదు ఖాతాలో జమ అవుతాయి. గతంలో ఓటీపీ ఉన్నప్పుడు సులువుగా పని జరిగేది. ఇప్పుడు స్వయంగా రైతు ఉండి ఐరిష్ పెడితేనే ధాన్యం నగదు బ్యాంకు ఖాతా లో జమ అవుతాయని నిబంధన పెట్టడం కొంచెం కష్టతరంగానే కనిపిస్తున్నది. ఎం దుకంటే చాలామంది రైతులు పట్టణాల్లో ఉండి వ్యవసాయం చేస్తుండడం.. ఐరిష్ కోసం వస్తే ఆన్‌లైన్ కాకపోతే చాలా ఇబ్బందులు పడాల్సివస్తుంది.

అర్ధనారీశ్వరి అలంకరణలో అమ్మవారు

కరీంనగర్ రూరల్: అక్టోబర్ 9: దేవీశరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు అర్ధనారీశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. తర్వాత దుర్గా భవానీల రథోత్సవం నిర్వహించగా, మహిళలు కుంకుమార్చన, పూజలు చేసి.. చీరెసారెలు పెట్టి.. ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★ I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN
NTK-325721

కావలెను

★ మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావాలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర|| సెల్: 8341220970
NTK-335282

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

కమాన్‌చౌరస్తా: శమీ పూజలు చేస్తున్న గంగుల కుటుంబ సభ్యులు, మేయర్

వీణవంక: రామ్‌లీలాలో భాగంగా విల్లు ఎక్కుపెడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా: మహాశక్తి ఆలయంలో పూజల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ దంపతులు

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ఘనంగా విజయదశమి

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలో రాంలీలా వేడుకకు హాజరైన ప్రజలు

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలో రావణ దహనం

చొప్పదండి: చొప్పదండిలో రాంలీలా వేడుకకు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, స్వామి రాధామనోహర్ దాస్

రామడుగు: శమీ పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వేంకటేశ్వర్‌రావు, తదితరులు

కమాన్‌చౌరస్తా: మార్క్‌ఫెడ్ మైదానంలో వేడుకకు హాజరైన జనం

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలో రాంలీలా వేడుకకు హాజరైన ప్రజలు

జిల్లా వ్యాప్తంగా శనివారం విజయదశమి వేడుకలు సంబురంగా జరుపుకొన్నారు. భక్తుల ప్రత్యేక పూజలు, వాహన, శమీ పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దలకు జమ్మి ఇచ్చి.. వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. పలు ప్రాంతాల్లో మహిషాసుర సంహారలీలలను కనులపండువలా నిర్వహించారు. అలాగే దుర్గామాత మండపాల్లో వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలో రాంలీలా వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం రావణ దహనం, క్రాకర్ షో నిర్వహించారు. అయితే గతంలో పోలిస్తే రాంలీలా వేడుకల్లో జోష్ తగ్గింది. జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌లోని చింతల వద్ద, రాంనగర్ మార్క్‌ఫెడ్ మైదానంలో నిర్వహించిన మహిషాసుర సంహార కార్యక్రమాలు, యజ్ఞవరాహస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు పాల్గొన్నారు. అలాగే చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఎంపీ బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దంపతులు, ఆర్డీవో మహేశ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. వీణవంక మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన రామ్‌లీలా వేడుకకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

- కరీంనగర్ నెట్‌వర్క్

రామడుగు: లక్ష్మీపూర్‌లో దుర్గామాత నిమజ్జన వేడుకల్లో కోలాటం ఆడుతున్న మహిళలు

మానకొండూర్: శోభాయాత్రలో భాగంగా దుర్గామాత వేషధారణతో భక్తులు

వీణవంక: ఘన్ముక్ల గ్రామంలో దుర్గామాత అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ముగిసిన దేవీనవరాత్రోత్సవాలు

కమాన్‌చౌరస్తా/ రామడుగు/జమ్మికుంట/ హుజూరాబాద్ టౌన్/మానకొండూర్/వీణవంక, అక్టోబర్ 13 : దేవీశరన్నవరాత్రోత్సవాల సందర్భంగా మండపాలు, పలు ఆలయాల్లో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాల నిమజ్జన శోభాయాత్రలను ఆదివారం నేత్రపర్వంగా కొనసాగాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కార్యకర్తలు, భక్తులు, భవానీ దీక్షాపరులు అమ్మవారి ప్రతిమలను ప్రత్యేక వాహనాల్లో చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కాషాయ ధ్వజాలు, భజనలు, భక్తి పాటలు, మేళతాళాలు, డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్ మధ్య నిమజ్జనోత్సవ సందడి నెలకొన్నది.

'ఉపాధి' పనులకు ఆమోదం లభించేనా?

కలెక్టరేట్, అక్టోబర్ 13: ఉపాధిహామీ పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల ప్రణాళికల రూపకల్పన జిల్లాలో మొదలైంది. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ నెల 2నుంచి గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ, చేపట్టాల్సిన పనులు.. పాల్గొనే కూలీల సంఖ్య, తదితర వివరాలు సేకరిస్తున్నారు. 2025-26 ఏడాదిలో జిల్లాలో 14రకాల పనులు చేపట్టేందుకు నిర్ణయించి, అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అయితే, ప్రణాళికలు సరే.. పనులు చేపట్టేందుకు ఆమోదం లభించేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం కింద 40రకాల పనులు చేసే అవకాశం ఉండగా, నాలుగేండ్ల నుంచి కేంద్రం ఏటేటా పనులు తగ్గిస్తోంది. గతేడాది వరకు 14పనులకే పరిమితం కాగా, ఈసారి కూడా అత్యంత ముఖ్యమైన పనులు మాత్రమే గ్రామాల్లో చేపట్టాలనే ఆదేశాలు గ్రామీణాభివృద్ధి అధికారులకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, నర్సరీల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాల నిర్వహణ, నీటి నిల్వ గుంతల తవ్వకం, పశువుల పాకల నిర్మాణం, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారులకు రోడ్లు వేయడం లాంటి పనులపై మాత్రమే తీర్మాణాలు చేయాలంటూ ఉపాధి మేట్‌లకు సూచిస్తున్నట్లు సమాచారం. గతేడాది కూడా ఇలాగే 20కిపైగా పనులు చేపట్టడంపై ముందస్తు ప్రణాళికలు రూపొందించి సెర్ప్‌కు పంపినా, కేవలం కొన్నింటికి మాత్రమే చేయించినట్లు ఉపాధి కూలీలే పేర్కొంటున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 82,460యాక్టివ్ జాబ్‌కార్డులుండగా, 1,26,338 మంది యాక్టివ్ ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో 83,575 మందికి మాత్రమే గతేడాది ఉపాధి కల్పన జరిగినట్లు అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఏటా కనీసం వంద రోజులకు తగ్గకుండా పని కల్పించాల్సి ఉంటుంది. అయితే, జిల్లాలో గతేడాది మాత్రం 63కుటుంబాలకు మాత్రమే పని కల్పించినట్లు అధికారుల లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి. గతేడాది మార్చి నుంచి ఈఏడాది ఏప్రిల్ వరకు 28.50 లక్షల పని దినాల కల్పన లక్ష్యం కాగా, 20.26 లక్షల పనిదినాలు మాత్రమే కూలీలకు కల్పించారు. ఈ సారి ఇంకా పనిదినాల సంఖ్య తగ్గుతుందేమోననే ఆందోళన కూలీల్లో నెలకొన్నది.

దసరా వేడుకలకు వెళ్తూ..

- చెట్టుకు బైక్ ఢీకొని యువకుడి మృతి

వినయ్ (ఫైల్)

శంకరపట్నం, అక్టోబర్ 13: దసరా వేడుకలకు వెళ్తూ బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. శంకరపట్నం మండలం తాడికల్ శివారులో జరిగిన ఈ ఘటనతో చిగురుమామిడి మండలం లంబాడిపల్లెలో విషాదం అలుముకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడిపల్లెకి చెందిన బండారిపల్లి రామస్వామి కుటుంబం కరీంనగర్‌లో ఉంటున్నది. రామస్వామి చిన్నకొడుకు వినయ్(25) శనివారం దసరా పండుగను శంకరపట్నం తాడికల్‌లో ఉండే తన పెద్దమ్మ మొలుగూరి భాగ్య ఇంట్లో జరుపుకొనేందుకు శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరాడు. బైక్ తాడికల్ శివాలయం మూల మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఓటు నమోదు చేసుకోవాలి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని శనివారం ఆయన కరీంనగర్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు. ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమమే లక్ష్యంగా పని చేసేందుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేశ్ రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, తిరుపతి స్వామి, సురేందర్, అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్13: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి చెందడంతో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల నాయకులు ఆదివారం సంతాపం తెలిపారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ప్రొఫెసర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటు అని అన్నారు. ఇక్కడ ప్రజాసంఘాల నాయకులు సదానందం, ఈశ్వర్‌రెడ్డి, వెంకట్రాజం, రత్నం, సమ్మయ్య, ఓదెలు, రవీందర్, శ్రీనివాస్, ఐలయ్య, ప్రభాకర్ ఉన్నారు.

సాయిబాబాది కుట్రపూరిత హత్య

శంకరపట్నం, అక్టోబర్ 13: ఆదివాసీల హక్కుల నాయకుడు సాయిబాబాను కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా హత్య చేయించిందని సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, ఆదివాసీ హక్కుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జీఎన్ సాయిబాబాది కేంద్ర ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. సాయిబాబా హత్యను ప్రజాస్వామిక వాదులు, ప్రజలు ముక్త ఖంఠంతో ఖండించాలన్నారు.

రేపటి నుంచి 'గాలికుంటు' శిబిరాలు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 13: మున్సిపాలిటీ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల15 నుంచి నవంబర్ 13 వరకు పశువులకు గాలి కుంటు నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సింగాపూర్ పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాలను పాడి రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, అక్టోబర్ 13: నగరంలోని కేకే దవాఖాన ఎదురుగా వీధిలో కొనసాగుతున్న హుడా స్కూల్ నిర్వహణను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ డా జితేందర్‌ను పాఠశాల యాజమాన్యం కోరారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి ఆదివారం డీజీపీని తన నివాసంలో కలిశారు. పాఠశాల యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకున్న భవన యజమాని చనిపోవడంతో తామే వారసులమంటూ కొంతమంది తమపై ఒత్తిడి చేస్తూ, బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నపళంగా తాము మరో భవనం గుర్తించలేకపోతున్నామని ఆవేదన చెందారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలని కోరగా, ఎంఐఎం అండగా ఉంటుందని అసదుద్దీన్ ఓవైసీ అభయమిచ్చినట్లు ఆ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. డీజీపీని హుడా స్కూల్ చైర్మన్ అహ్మద్ అబ్దుల్ అజీమ్, కరస్పాండెంట్ అబ్దుల్ రబ్ ముజాహిద్, లతీఫ్, ఖాలిద్ లతీఫ్ కలిశారు.

విద్యా సదస్సులో ప్రొఫెసర్ ప్రసంగం

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్13: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ డా కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఉజ్జెకిస్తాన్‌లో యునెస్కో ఆసియా పసిఫిక్ వ్యవస్థాపక విద్యా సదస్సులో పాల్గొని శనివారం ప్రసంగించారు. యువత ఎదుర్కొంటున్న సంక్లిష్ట సవాళ్లు-అధిగమించే విద్యావిధానాల గురించి ఆయన వివరించారు. యువత భవిష్యత్ కార్యాచరణ, వ్యవస్థాపక విద్యా అవశ్యకత, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, నూతన బోధన విధానాలపై చర్చించారు.

'ధిక్కార స్వరఝరి దాశరథి' పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13: ధిక్కార స్వరంతో నిజాన్ని ఎదిరించిన ధీరకవి దాశరథి అని తెలంగాణ ప్రభుత్వ దాశరథి సాహితీ పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథం పేర్కొన్నారు. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ద్వారా ప్రచురించబడిన ధిక్కార స్వరఝరి దాశరథి కవితా సంకలనాన్ని ఆదివారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. విశిష్ట అతిథి మహ్మద్ ఖాలిద్‌కు జీవనతత్వ గీత విశ్వజన హిత సంహిత శ్రీమద్భగవద్గీత పుస్తకాన్ని అందించి సత్కరించారు. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో విమల సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జెల్ది విద్యాధర్, పెద్దూరి వెంకటదాసు, డాక్టర్ రాధా కుసుమ, గంప ఉమాపతి, నూజెట్టి రవీంద్రనాథ్, గండ్ర లక్ష్మణ్‌రావు, యోగ సంపత్ కుమారాచార్య, నీలగిరి అనిత, శశి కిరణ్మయి, నామని సుజనాదేవి, చేరాల రాజశేఖర్, శనగల మానసాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

వీణవంక, అక్టోబర్ 13: యప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి శనివారం తన ఇంటి ఆవరణలో 220మంది విద్యార్థులకు రూ.4.40లక్షల విలువైన స్కాలర్‌షిప్స్ చెక్కులు అందజేశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ సమ్మిరెడ్డి, నాయకులు అమృత ప్రభాకర్, దాసారపు సమ్మయ్య, దాసారపు రాజు, సమిండ్ల చిట్టి, రమేశ్, తదితరులు ఉన్నారు.

బావిలో పడి యువకుడి మృతి



త్రినాథ్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 13: పండుగపూట ఓ యువకుడు బావిలో పడి మృతి చెందిన ఘటన రంగంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల నాంపెల్లి-భాగ్యలక్ష్మికి కొడుకు త్రినాథ్ అలియాస్ సన్ని(19), ముగ్గురు బిడ్డలు ఉన్నారు. త్రినాథ్ శనివారం మధ్యాహ్నం తన ప్యాంట్ అట్లేషన్ కోసం మిత్రులు కొమ్మగల్ల కిరణ్, రుద్రారం స్వస్తిక్ అలియాస్ తిలక్‌తో కలిసి తన తండ్రి ఆటోలో రంగంపేటకు వెళ్లారు. సాయంత్రమైనా కొడుకు ఇంటికి రాకపోవడంతో తండ్రి నాంపల్లి కొడుకుకు ఫోన్ చేయగా, తాము ముగ్గురం ఉన్నామని, ఇంటికి వస్తున్నామని చెప్పాడు. రాత్రి 7 గంటలకు స్వస్తిక్.. నాంపల్లికి ఫోన్ చేసి సన్నీ బావిలో పడి మృతిచెందాడని సమాచారం ఇవ్వగా, కుటుంబ సభ్యులు బావి వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వస్తిక్, తడిసిన బట్టలతో కొమ్మగల్ల కిరణ్‌తోపాటు మరో వ్యక్తి రామగిరి సందీప్ ఉన్నట్లు నాంపల్లి గుర్తించాడు. రాత్రి కావడంతో సహాయక చర్యలు చేపట్టలేదు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం కోసం కరీంనగర్ దవాఖానాకు తరలించారు. సన్ని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

తల్లిని తోసి.. బావిలో దూకి..

తిమ్మాపూర్, అక్టోబర్13: మల్లాపూర్‌కు చెందిన బత్తిని సాయి (24) కొన్నేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలై మానసికంగా ఇబ్బందిపడుతున్నాడు. ఇంటి వద్ద ఉంటూ తల్లిదండ్రులకు వ్యవసాయంలో తోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తల్లితో కలిసి పొలం వద్దకు వెళ్లిన సాయి.. సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో బావి పక్కనుంచి వెళ్తుండగా తల్లి కళ్లను దూరంగా నెట్టేసి.. బావిలో దూకాడు. ఎస్సై వివేక్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నా ప్రాణం పోయినా.. ఒక్క ఇల్లు కూల్చనియ్యా

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్13: తన ప్రాణంపోయినా.. హుజూరాబాద్‌లో హైడ్రా పేరిట ఒక్క ఇల్లు కూడా కూల్చనివ్వ.. ఆపదొస్తే చెప్పండి.. క్షణాల్లో స్పందించి కాపాడుకుంటా.. అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన రామ్‌లీలా వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. హుజూరాబాద్‌కు హైడ్రా వచ్చినట్లు తెలిసిందన్నారు. అధికారులు ఇబ్బంది పెడితే తక్షణమే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం రామ్‌లీలా కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆనందోత్సవాల మధ్య వేడుకలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మున